# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 28 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## హైదరాబాద్‌లో 15 శాతం తగ్గిన నేరాలు

- సీపీ వీసీ సజ్జనార్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నేర నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించామని, గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 15శాతం నేరాలు తగ్గాయని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తెలిపారు. కానీ గతేడాదితో పోల్చితే మహిళలు, చిన్నారులపై మాత్రం నేరాలు పెరిగాయన్నారు. 6 శాతం మహిళల పట్ల, 7 శాతం చిన్నారుల పట్ల నేరాలు పెరిగాయన్నారు. 24/7 పోలీసులు పనిచేస్తు న్నారని,రాష్ట్రంలో నేరేలు చేసేందుకు ఇతర రాష్ట్రాల నేరగాళ్లు సైతం భయపడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాదకద్రవ్యాలు, నకిలీ వస్తువులు, విత్తనాల నియంత్రణపై డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రానున్నరోజుల్లో నార్కోటిక్ టీమ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2025 వార్షిక నేర నివేదికను సీపీ విడుదల చేశారు. ఈ సమావేశంలో అదనపు, జాయింట్ సీపీలు, డీసీపీలతోపాటు తదితర విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్నారు

మిగితా 2వ పేజీలో

## ఎంజీనరేగా రద్దుకు వ్యతిరేకంగా

# దేశవ్యాప్త ఉద్యమం

- జనవరి 5 నుంచి ఉపాధి బచావో అభియాన్
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం
- మోదీ ప్రభుత్వం పేదల వెన్నుపోటు పొడిచింది
- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ల హక్కులను హరించే కుట్ర
- రైతులు, కార్మికుల పక్షాన కాంగ్రెస్
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీనరేగా)ను రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ యత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆయన ఆరోపించారు. పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీల ఓట్లను తొలగించేందుకు పక్కా ప్రణాళికతోనే ఈ చర్యలు చేపడుతున్నారని వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో మాట్లాడిన ఖర్గే.. ఎంజీనరేగా వంటి ప్రజా సంక్షేమ పథకాలను కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతని అన్నారు. ఓటరు జాబితాల సవరణ పేరుతో జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవడానికి ఇంటింటి ప్రచారం చేపట్టాలని పార్టీ నేతలకు సూచించారు.ఎంజీనరేగా యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చారిత్రక చట్టమని, ఇది గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడమే కాకుండా గౌరవప్రదమైన జీవనానికి మార్గం చూపిందని ఖర్గే గుర్తు చేశారు. ఈ పథకాన్ని రద్దు చేయడం ద్వారా మోదీ ప్రభుత్వం పేదల వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. ఈ చట్టాన్ని రద్దు చేయడం మహాత్మా గాంధీకి అవమానమని వ్యాఖ్యానించారు.

**ఎస్ఐఆర్‌పై ఆందోళన**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ల హక్కులను హరించే కుట్ర జరుగుతోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

**రైతులు, కార్మికుల పక్షాన కాంగ్రెస్**

కార్పొరేట్ ప్రయోజనాల కోసమే కేంద్రం విధానాలు అమలు చేస్తోందని విమర్శించిన ఖర్గే.. గతంలో భూసేకరణ చట్టం, వ్యవసాయ చట్టాల విషయంలోనూ కాంగ్రెస్ పోరాడిందని గుర్తుచేశారు. రైతుల పోరాటం ఫలితంగానే ఆ చట్టాలను కేంద్రం వెనక్కి తీసుకుందని చెప్పారు. ఎంజీనరేగాపై కూడా ప్రజా ఉద్యమం ద్వారా విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

**సీడబ్ల్యూసీ సమావేశంలో ప్రముఖులు**

ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్యతో పాటు పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ హాజరుకాలేకపోయినా, పలువురు ముఖ్య నేతలు సమావేశానికి హాజరయ్యారు.

## 'ఇది పేదలపై, రాష్ట్రాలపై దాడి'

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజీనరేగా) రద్దు చేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది పేదల జీవనాధారంపై నేరుగా దాడి చేయడమేనని, రాష్ట్రాల హక్కులను కాలరాయడమేనని ఆయన విమర్శించారు. నోట్ల రద్దు తరహాలోనే ఈ నిర్ణయం కూడా దేశానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందని ఆరోపించారు. శనివారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, "మోదీ ప్రభుత్వం ఒక్క కలంతో ఎంజీనరేగాను నాశనం చేసింది. ఇది కేవలం విధానపరమైన మార్పు కాదు, కోట్లాది పేదల జీవితాలపై దాడి. డీమోనిటైజేషన్ సమయంలో ఎలాంటి చర్చ లేకుండా నిర్ణయం తీసుకున్నట్లే, ఇప్పుడు కూడా అదే పద్ధతిని అనుసరించారు" అని అన్నారు. ఎంజీనరేగా కేవలం ఉపాధి పథకం మాత్రమే కాదని, గ్రామీణ ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించిన హక్కుల ఆధారిత చట్టమని రాహుల్ పేర్కొన్నారు. "ఈ చట్టం ద్వారా పేదలకు గౌరవప్రదమైన జీవనం లభించింది. అలాంటి చట్టాన్ని రద్దు చేయడం దేశ సమాఖ్య వ్యవస్థపైనే దాడి చేయడమే" అని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభిస్తున్నామని రాహుల్ ప్రకటించారు. "జనవరి 5 నుంచి ప్రజలతో కలిసి రోడ్డెక్కుతాం. పేదల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుంది" అని స్పష్టం చేశారు.

## నేడు గాంధీ చిత్రపటాలతో నిరసన

- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ చిత్రపటాలతో నిరసన తెలుపనున్నట్టు టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమం ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీ విగ్రహాల వద్ద గాంధీ చిత్రపటాలను పట్టుకుని నిరసన తెలపాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

## డిసెంబర్ 31 వరకు చలి

- తెలంగాణలో క్రమంగా తగ్గనున్న చలి తీవ్రత
- సంక్రాంతికి మళ్లీ స్వల్పంగా పెరిగే అవకాశం
- భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రస్తుతం తీవ్ర చలితో ప్రజలు వణికిపోతున్నారు. పలు జిల్లాల్లో కనీస ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే దిగువకు పడిపోవడంతో సాధారణ జీవనం ప్రభావితమవుతోంది. అయితే ఈ చలి తీవ్రత డిసెంబర్ 31 వరకు మాత్రమే కొనసాగుతుందని, అనంతరం ఉషో?గ్రతలు క్రమంగా పెరుగుతాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజా అంచనాల ప్రకారం, రాబోయే నాలుగు నుంచి ఐదు రోజులు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కనీస ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.

**జిల్లాల వారీగా చలి పరిస్థితి**

ఇటీవల నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం

తెలంగాణలో సంగారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, సిద్దిపేట జిల్లాల్లో కనీస ఉషో?గ్రతలు 6 నుంచి 9 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్%-- మల్కాజ్‌గిరి జిల్లాల్లో 13 నుంచి 15 డిగ్రీల వరకు చలి తీవ్రత కొనసాగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లోనూ చలి ప్రభావం ఎక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 7-9 డిగ్రీల వరకు పడిపోయాయి.

పల్లెలు, వ్యవసాయ ప్రాంతాల్లో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు చలి తీవ్రంగా ఉండటంతో పాటు కొన్ని చోట్ల పొగమంచు కమ్మే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. పగటిపూట ఎండ ఉన్నప్పటికీ ఉదయం, సాయంత్రం వేళల్లో చలిగాలులు కొనసాగుతాయని తెలిపింది.

**సంక్రాంతి సమయంలో మళ్లీ చలి పట్టు**

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జనవరి ప్రారంభంలో ఉష్ణోగ్రతలు క్రమంగా 1-2 డిగ్రీలు పెరుగుతాయి. దీంతో డిసెంబర్ చివర్లో ఉన్న తీవ్రమైన చలి కొంత తగ్గుతుంది. అయితే సంక్రాంతి సమయానికి (జనవరి రెండో వారం) ఉత్తర భారతం నుంచి వచ్చే చల్లని గాలుల ప్రభావంతో మళ్లీ స్వల్పంగా చలి పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో రాత్రి ఉషో?గ్రతలు తాత్కాలికంగా పడిపోవచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్ష సూచనలు లేవని, వాతావరణం పొడిగానే కొనసాగుతుందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

## ప్రజల సంపద ప్రజలకే



- దోపిడీకి తావు లేదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పాలేరు నియోజకవర్గంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం

**బలగం టీవి, ఖమ్మం**

ప్రజల సంపదను ప్రజలకే అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దోపిడీకి ఎలాంటి అవకాశం ఉండదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం పాలేరు నియోజకవర్గంలోని అనంతనగర్‌లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన అనంతరం, మరో సబ్‌స్టేషన్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విద్యుత్ సరఫరా మెరుగుదలతో గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మరింత మెరుగవుతాయని భట్టి విక్రమార్క తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో నిరంతర విద్యుత్ సరఫరా, తక్కువ వోల్టేజ్ సమస్యలు లేకుండా గృహ, వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు ఈ సబ్‌స్టేషన్ ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. త్వరలో మరో సబ్‌స్టేషన్‌ను కూడా పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని చెప్పారు.

గత ప్రభుత్వాలు పదేళ్లపాటు పాలించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాయని విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకొని పాలన సాగిస్తోందని స్పష్టం చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ద్వారా పాలేరు నియోజకవర్గంలో 65 శాతం కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 65 శాతం కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతున్నట్లు పేర్కొన్నారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ఏడాదికి రూ.12,500 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అలాగే పంటలకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తూ రైతులకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని, ఇందుకోసం ఏటా రూ.13,500 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని తెలిపారు. మహిళల సంక్షేమం దిశగా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, కోటి మందికి చీరల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల నిర్మాణం చేపట్టామని, రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.2,500 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షల వరకు విస్తరించి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి లభించిన భారీ మద్దతు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గిరిజన సంక్షేమ సంస్థ చైర్మన్ లక్ష్మణ్, జిల్లా కలెక్టర్, ఎన్పిడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## అబద్ధపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ సర్పంచుల సన్మాన సభ..

**బలగం టీవి, మహబూబాబాద్:**

పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచుల సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ రవీందర్ రావు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రెడ్యా నాయక్, హరిప్రియ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసి రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 11 విడతల్లో రూ.72 వేల కోట్లు రైతులకు నేరుగా అందాయని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. "కేసీఆర్‌పై మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదు. ప్రజలను మోసం చేస్తూ రోజూ కొత్త డ్రామాలు ఆడుతున్నారు. పరిపాలన చేతకాక దోషారోపణలకే పరిమితమయ్యారు" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు నిధులు తగ్గించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, అయినా బీఆర్ఎస్ సర్పంచులు ధైర్యంగా నిలబడి ప్రజల కోసం పనిచేస్తున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే న్యాయపోరాటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. అవసరమైతే ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

"బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయి. తాగునీరు, రహదారులు, విద్యుత్ సదుపాయాలు కల్పించాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటన్నింటినీ నిర్వీర్యం చేస్తోంది. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు" అని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సాధించిన విజయాన్ని రాబోయే మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. చివరగా, కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ తెలంగాణను గెలిపించుకోవాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

లగచర్లలో గిరిజన ఆడబిడ్డల పైన కాంగ్రెస్ పార్టీ చేసిన అరాచకాలకు అండగా మహబూబాబాద్‌లో నిర్వహించిన భారీ సమావేశం తర్వాతనే లగచర్ల భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. మహబూబాబాద్ లాంటి మారుమూల జిల్లా కేంద్రంలోనూ మెడికల్ కాలేజీని, జిల్లా ఆసుపత్రిని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ గారికి దక్కుతుంది. నూకల రామచంద్రారెడ్డి విగ్రహాన్ని పెట్టాలని నిర్ణయం తీసుకున్నది కేసీఆర్. రామచంద్రారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మరిచిపోయింది. ఎక్కడ రామచంద్రారెడ్డి.. ఎక్కడ రేవంత్ రెడ్డి!

"ఢిల్లీకి డబ్బు సంచులు ఇచ్చే వాళ్లు ముఖ్యమంత్రి అయ్యారు. ఢిల్లీకి డబ్బు సంచులు ఇచ్చి ఉంటే 1970 దశకంలోనే రామచంద్రారెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవారు. ఢిల్లీ గులాములు రామచంద్రారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించడం అంటే ఆయన ఆత్మ క్షోభిస్తుంది. రానున్న అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాను" అని అన్నారు.

## సింగరేణిని ప్రయివేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

- మాజీ మంత్రి టి.హరీశ్‌రావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సింగరేణి సంస్థను ప్రయివేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్ గౌతమ్‌ను కలిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. సంస్థను ఆర్థికంగా దివాలా తీయించి తద్వారా ప్రయివేట్‌కు ధారాదత్తం చేసే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలైన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీఎల్ నుంచి సింగరేణికి రూ.42 వేల కోట్లు రావాల్సి ఉండగా, వాటిని చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా సంస్థ ఆర్థికంగా ఇబ్బందులు పడుతోందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సింగరేణికి ఆ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు జీతాల కోసం అగచాట్లు పడుతుంటే సంస్థకు చెందిన సొమ్మును సీఎం రేవంత్‌రెడ్డి దుబారా చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మెస్సీ ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌కు సింగరేణి సంస్థకు చెందిన రూ.100 కోట్లు వ్యయం చేశారని ఆరోపించారు. కార్మికుల బోనస్ విషయంలోనూ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. 2024 25 ఆర్థిక సంవత్సరంలో 6,394 కోట్ల నికర లాభం సాధించినా, బోనస్ కేవలం 2,360 కోట్లుగానే పరిగణించి 34 శాతం మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో మొత్తం లాభంపైనే బోనస్ ఇవ్వగా, ప్రస్తుతం 50 శాతం కోత విధించారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌బాల్ మ్యాచ్‌పై విచారణ చేస్తామని హెచ్చరించారు. అలాగే డిపెండెంట్ ఉద్యోగాలివ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మొత్తం వారసత్వ ఉద్యోగాల్లో సగం మందికి కూడా ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ బోర్డును క్రమం తప్పకుండా నిర్వహించి అర్హులందరికి న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డును వెంటనే సమావేశ పర్చి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## డెస్క్ జర్నలిస్టుల సమస్య పరిష్కరిస్తాం..

- డీజేఎఫ్‌టీ నేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



**బలగం టీవి, ఖమ్మం**

డెస్క్ జర్నలిస్టులకూ గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్ టీ) ఖమ్మం జిల్లా అడ్ హక్ కమిటీ సభ్యులు, టీడబ్ల్యూజేఎఫ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు సంయుక్తంగా శనివారం మహబూబాబాద్ లో మంత్రికి వినతిపత్రం అందించారు. డెస్క్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ సమస్యలను డీజేఎఫ్ టీ నేతలతో కలిసి టీడబ్ల్యూజేఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు సాగర్ దువ్వా, స్టేట్ కౌన్సిల్ సభ్యులు నాగేందర్ రెడ్డి వివరించారు. డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.

మంత్రి సానుకూలంగా స్పందిస్తూ డెస్క్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు మంత్రిని కలిసిన వారిలో డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్ టీ) అడహక్ కమిటీ కన్వీనర్ కాంకూరి వెంకటేశ్వరరావు, కో- కన్వీనర్లు కేతిరెడ్డి అచ్చిరెడ్డి, వంశీ, శాబాదు కరుణాకర్ రెడ్డి, నాయకులు వెంకటప్పయ్య, వీరభద్రాచారి, బాలక ృష?, అశోక్, కరుణాకర్, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు యాస లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వర్కింగ్ జర్నలిస్టులను అక్రిడిటేషన్లు, మీడియా కార్డుల పేరుతో విభజించొద్దని డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ(డీజేఎఫ్‌టీ) రాష్ట్ర అధ్యక్షులు బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్ ప్రభుత్వాన్ని కోరారు. డెస్క్ జర్నలిస్టులకు పాత పద్ధతిలోనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట నిరసన చేపట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. అందులో భాగంగా లక్డీకాపూ ల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్ర మంలో వివిధ పత్రికల డెస్క్ జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరవ్వగా.. టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే, ఎస్‌జాట్ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా డీజేఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు తీసేసి మీడియా కార్డులు ఇవ్వడం సరికాదన్నారు. ఇది జర్నలిస్టుల పట్ల వివక్ష చూపినట్టవుతుందన్నారు. జీవో నెంబర్ 252ను సవరించాలని, స్పోర్ట్స్, సినిమా, ఫీచర్స్, వెబ్, కల్చరల్, బిజినెస్, కార్టునిస్టులకు గతంలో మాదిరిగానే అక్రిడిటేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ కదిరవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజేఎఫ్‌టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ రాజారామ్, కోశాధికారి నిసార్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ప్రధాన కార్యదర్శి బి.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్టుల అరెస్టును ఖండించిన కేటీఆర్**

జర్నలిస్టుల సమస్యలపై శాంతియుతంగా వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళ్లిన TUWJ-TJF నేతలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది కేవలం నేతల అరెస్టు మాత్ర మే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కేసే కుట్ర అని ఆయన విమర్శించారు. కొత్త జీవో సాకుతో జర్నలిస్టుల అక్రిడిటేషన్లలో కోత విధించడం ద్వారా ప్రభుత్వం వారి ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చిన ఆరు గ్యారంటీ లతో పాటు ప్రజాస్వామిక పరిరక్షణ పేరుతో ఇచ్చిన ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టులను అరెస్టు చేయడమేనా అని అన్నారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం ద్వారా ప్రభుత్వం వారి ఉపాధిని మరియు ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని అన్నారు.

## తెలంగాణ టెట్ హాల్‌టికెట్లు విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించిన హాల్‌టికెట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. అభ్యర్థులు అధికారిక టెట్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. జనవరి 3, 4, 5, 6, 8, 9, 11, 19, 20 తేదీల్లో టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఈ ఏడాది టెట్‌కు పేపర్-1, పేపర్-2లకు కలిపి మొత్తం 2.37 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సేవలో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు కూడా టెట్ తప్పనిసరి కావడంతో, కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లు కలుపుకొని సుమారు 70 వేల మంది అభ్యర్థులు ఈసారి పరీక్ష రాస్తున్నారు.టెట్ ఫలితాలను ఫిబ్రవరి 10 నుంచి 16వ తేదీల మధ్య విడుదల చేస్తామని పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది.

# అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య


బలగం టీవీ, మెదక్



అప్పుల బాదతో అన్నదాన ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. నాగాపూర్ గ్రామానికి చెందిన చింతకింది నరసింహులు (55) అనే రైతు తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాగు కోసం పెట్టుబడి నిమిత్తం బయట అప్పులు తెచ్చాడు. అయితే, ఈ ఏడాది ప్రకృతి సహకరించకనో లేదా ఇతర కారణాల వల్లనో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. వచ్చిన అరకొర ఆదాయం కుటుంబ అవసరాలకే సరిపోకపోవడం, మరోవైపు చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో నరసింహులు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పుల వారి ఒత్తిడి తట్టుకోలేక, భవిష్యత్తుపై భయం నెలకొనడంతో శనివారం తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నరసింహులు మృతితో నాగాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తమను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ ఇన్నోవేషన్ సమ్మిట్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం..

బలగం టీవీ, హైదరాబాద్



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) కు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం అందింది. 2026 జనవరి 9 నుండి 11 వరకు దుబాయ్‌లో జరగనున్న 2వ అంతర్జాతీయ జునికార్న్ అండ్ గ్లోబల్ ఇన్నోవేషన్ సమ్మిట్ లో గౌరవ అతిథిగా పాల్గొనవలసిందిగా ఆయనను ఆహ్వానించారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాల్లో కేటీఆర్ చేసిన కృషిని గుర్తిస్తూ ఈ ఆహ్వానం పంపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా సాధికారత వంటి రంగాలలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లాభాపేక్ష లేని సంస్థ 'ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్' ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 100 మందికి పైగా అంతర్జాతీయ కంపెనీల సీఈఓలు, వెంచర్ క్యాపిటలిస్టులు, పెట్టుబడిదారులు మరియు యువ ఆవిష్కర్తలు పాల్గొననున్నారు. ముఖ్యంగా 'జునికార్న్ 100కే' చొరవ ద్వారా గ్రామీణ యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టి సారించనుంది. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి ఇన్నోవేషన్ మరియు స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని, సాంకేతికత ఆధారిత పాలన మరియు అందరినీ కలుపుకొ నిపోయే వృద్ధి కోసం ఆయన చేసిన నిరంతర కృషి పంచుకోవాలని కెటిఆర్ కు పంపిన ఆహ్వానంలో నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ వేదికపై కేటీఆర్ భాగస్వామ్యం యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుందని, అలాగే తెలంగాణ ఇన్నోవేషన్ మోడల్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళుతుందని ఆశించారు.

## నిమ్స్‌లోని యూరాలజీ విభాగంలో సబ్-స్పెషాలిటీ క్లినిక్‌లు

- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ పంజాగుట్ట నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగంలో యూరో–ఆంకాలజీలి, రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, పీడియాట్రిక్ యూరాలజీ మూడు సబ్–స్పెషాలిటీ క్లినిక్‌లను ప్రారంభించనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్లినిక్‌లు యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాహుల్ దేవర్ ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పెషాలిటీ బ్లాక్ 6వ అంతస్తులోని యూరాలజీ విభాగంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సేవల ద్వారా మూత్ర సంబంధిత క్యాన్సర్ వ్యాధులు, కిడ్నీ మార్పిడి చికిత్సలు, పిల్లల యూరాలజీ సమస్యలకు అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రజలకు నాణ్యమైన, వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని డైరెక్టర్ పేర్కొన్నారు.



# చోరికి గురైన విద్యుత్ తీగల కరెంటు సమస్యను పునరుద్ధరించాలి

- సిరిసిల్ల సెస్ ఛైర్మన్‌ను కలిసిన సర్పంచ్ భాస్కర్

బలగం, బోయినిపల్లి

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామ స్మశాన వాటికలో గతములో మూడు విద్యుత్ మెయిన్ తీగలు అలాగే ఎస్సీ కాలనీలో మూడు స్తంభాల తీగల చోరీ జరిగింది. స్మశాన వాటికలో దహనసంస్కారాలకు ఇబ్బంది కలుగుతుందని, హరిత హారం మొక్కలు ఎండిపోతున్నాయని గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరించాలని, సర్పంచ్ అనుముల భాస్కర్, సిరిసిల్ల సెస్ ఛైర్మన్ ను కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. సర్పంచ్ అనుమల భాస్కర్ మాట్లాడుతూ: సెస్ ఛైర్మన్ మరియు ఎండీలు ఈ విషయంపై తక్షణమే స్పందించారని, మూడు రోజులలో సమస్యను పరిష్కరిస్తామని అన్నారని తెలిపారు. ఛైర్మన్ మరియు ఎండీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# హైదరాబాద్‌లో 15 శాతం తగ్గిన నేరాలు



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్‌వన్ స్థాయిలో ఉన్నారని, గతంతో పోలిస్తే నగరంలో లా అండ్ ఆర్డర్ బాగుందని, క్రైమ్‌రేట్ అదుపులో ఉందని తెలిపారు. నగర పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఏ ఆపదవచ్చినా డయాల్ 100కు ఫోన్ చేయాలని కోరారు. అత్యాశకుపోయి నగరవాసులు సైబర్ నేరాలలో చిక్కుకుంటున్నారని, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. నగర వ్యాప్తంగా 5లక్షల 20 వేల సీసీ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు. హైదరాబాద్ క్రైమ్ రేట్ పెరిగిందని కొందరు ఆరోపిస్తున్నారని, అందులో వాస్తవం లేదన్నారు. గతంతో పోలిస్తే క్రైమ్ రేట్ తగ్గిందన్నారు.

ఈ ఏడాది మహిళలపై (జరిగిన దాడులు, లైంగిక వేధింపులతోపాటు ఇతర నేరాలు) 6 శాతం నేరాలు పెరిగాయన్నారు. గతేడాది 2,482 వరకు కేసులు నమోదైతే, ఈ ఏడాది 2,625 కేసులు నమోదయ్యాయన్నారు. చిన్నారులపై సైతం (నేరాలు) దాడులు పెరిగాయన్నారు. ఈ క్రమంలో 7శాతం పోక్సో కేసులు అధికమయ్యాయన్నారు. చిన్నారులపై దాడులు, ఇతర నేరాలకు పాల్పడిన వారిపై 2024లో 449కేసులు నమోదైతే, ఈ ఏడాది 568కేసులు నమోదయ్యాయన్నారు. అయితే గతేడాది మహిళలపై లైంగికదాడి కేసులు 484 నమోదైతే ఈ ఏడాది 405 నమోదయ్యాయన్నారు. వీటితోపాటు 7 శాతం దోపిడీలు పెరిగాయని తెలిపారు. కిడ్నాప్ కేసులు 2024లో 324 నమోదైతే, 2025లో 166కేసులు నమోదయ్యాయన్నారు. ప్రాపర్టీ వివాదాల కేసులు 61శాతం పెరిగాయన్నారు. నేరస్తులకు శిక్షలు పడిన కేసుల సంఖ్య 68శాతం పెరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు సంఖ్య 3,058 నుంచి 2,678 తగ్గాయన్నారు. సైబర్ క్రైమ్ నేరాలు గతేడాదితో పోలిస్తే 8శాతం తగ్గాయన్నారు. హత్య కేసులు తగ్గాయన్నారు. డ్రగ్స్ కేసులు పెరిగాయన్నారు. డ్రగ్స్, గేమింగ్ యాప్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ కేసులకు సంబంధించి గతేడాదితో పోలిస్తే కేసులు పెరిగాయని, ఈ వ్యవహారంలో ఈ ఏడాది 368 కేసులు నమోదుకాగా, 2,690 మంది నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామన్నారు. డేంజరస్ డ్రైవింగ్‌పై దృష్టి సారిస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తీర్చేందుకు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. నగరంలో వాహనాల సంఖ్యపెరిగిందని, అధిక సంఖ్యలో వాహనాలు వినియోగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నగర వాసులు సాధ్యమైనంత మేరకు ప్రజారావాణను ఉపయోగించాలని కోరారు.

# నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమం

బలగం టీవీ, కరీంనగర్



రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ సంగీతం శ్రీనివాస్ అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగంటువంటి నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో జిల్లా సర్పంచులు పాల్గొన్నారు. ఇందిరమ్మ కాలనీ గ్రామ సర్పంచ్ గడ్డం రచన మధుకర్ (చోటు)ని సన్మానించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో గెలిచిన సర్పంచ్లందరికీ సన్మానం చేసి గ్రామాలను కాపాడే బాధ్యత మీ పైనే ఉందని వివరించినా మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి వర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, కరీంనగర్ సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ సత్తు మల్లేష్, జిల్లా ఆర్టీఏ మెంబర్లు సంగీతం శ్రీనాథ్ (వింకు), పడాల రాహుల్ తో పాటు అన్ని బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు...

# నీట్ అడ్మిషన్లలో స్పోర్ట్స్ కోటా అమలు చేయాలి

- నీట్ అండ్ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో జరుగుతున్న నీట్ అడ్మిషన్లలో స్పోర్ట్స్ కోటాను అమలు చేయాలని నీట్ అండ్ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటిన విద్యార్థులు గత నాలుగేళ్లుగా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ అంశంపై మంగళవారం అసోసియేషన్ ప్రతినిధులు తెలంగాణ పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిశారు. ఈ సందరరేగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు పోడిశెట్టి రమేష్ కుమార్, సభ్యులు రాజేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొని సమస్యను వివరించారు.

మంత్రి వెంటనే స్పందిస్తూ కాళోజి నారాయణరావు యూనివర్సిటీ వీసీకి ఫోన్ చేసి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లుగా స్పోర్ట్స్ కోటా అంశం వివాదాస్పదంగా మారిందని, క్రీడా సర్టిఫికెట్ల ధృవీకరణ విషయంలో స్పష్టత లేకపోవడమే ఇందుకు కారణమని అధికారులు ఆయనకు వివరించారు. యూనివర్సిటీ వర్గాలు సర్టిఫికెట్ వెరిఫికేషన్ తమ పరిధిలోకి వస్తుందని చెబుతుండగా, స్పోర్ట్స్ అథారిటీ మాత్రం తామే పరిశీలన చేయాలని వాదిస్తుండటంతో సమస్య తలెత్తిందని తెలిపారు. ఈ కారణంగానే ప్రతీ ఏడాది నీట్ అడ్మిషన్లలో స్పోర్ట్స్ కోటా అమలు కాకుండా పోతోందని, గత ఏడాది ఈ వివాదం కొంతవరకు పరిష్కారమైందని, ఈసారి తప్పకుండా కోటా అమలు చేస్తామని వీసీ హామీ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

మియాపూర్‌కు చెందిన నీట్ అభ్యర్థి తల్లి మధురకవి కళ్యాణి మాట్లాడుతూ, తన కుమారుడికి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ గత సంవత్సరం ఎంబీబీఎస్ సీటు కోల్పోయాడని వేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అన్యాయం మరెవరికీ జరగకుండా చూడాలని ఆమె అసోసియేషన్‌ను కోరినట్లు తెలిపారు. స్పోర్ట్స్ కోటా అమలు విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర?యం తీసుకోవాలని, అర్హులైన క్రీడాకారులకు న్యాయం చేయాలని నీట్ అండ్ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# బాధిత కుటుంబానికి కత్తెర వరుణ్ కుమార్ ఆర్థిక సాయం

బలగం టీవీ, సిరిసిల్ల



రెండు రోజుల క్రితం సిరిసిల్ల పట్టణం లోని సర్దార్ నగర్ లో నూతన భవన యజమాని నిర్లక్ష్యం మూలం గా సెప్టిక్ ట్యాంక్ లో పడి మ ృతి చెందిన బాలుడు మామిడి రాకేష్ కుటుంబానికి బీఆర్ఎస్ పట్టణ యూత్ నాయకుడు కత్తెర వరుణ్ కుమార్ 5,000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కత్తెర వరుణ్ కుమార్ మాట్లాడుతూ"నిరుపేద కుటుంబం నకు చెందిన బాలుడు మామిడి రాకేష్ సెప్టిక్ ట్యాంక్ లో పడి మృతి చెందడం చాలా బాధాకరం. అంతే కాకుండా కుమారుడి తల్లి కూడా బ్రెస్ట్ కాన్సర్ తో బాధపడుతుందడం నిజంగా మా మనసుల్ని కదిలించింది కష్టాల్లో ఉన్న ఈ కుటుంబాన్ని పట్టణ ప్రముఖులు సహాయం అందించాలని కోరుకుంటున్నాను ఈమె కాన్సర్ ట్రీట్మెంట్ చలిమెడ హాస్పిటల్ లో జరుగుతున్నందున చలిమెడ లక్ష్మి నరసింహారావు దృష్టికి తీసుకు వెళ్తామని అలాగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి ఆ కుటుంబం నకు అండగా ఉంటామని తెలియజేసారు ఈ కార్యక్రమం లో పట్టణ బీఆర్ఎస్ సీనియర్ యూత్ నాయకులు ఎండీ మునీర్ పట్టణ యూత్ వైస్ ప్రెసిడెంట్ షాదబ్ 22 వ వార్డ్ అధ్యక్షులు పంగ మధు యూత్ నాయకులు కార్తీక్, రోషన్, ప్రణయ్, రాహుల్, ప్రదీప్,అక్షయ్ స ృజయ్ గణేష్ అవేజ్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు





## సొంత ఖర్చుతో
# బోర్ రిపేరు చేయించిన మాజీ కౌన్సిలర్

- వార్డు ప్రజల నీటి కష్టాలు తీర్చిన మాజీ కౌన్సిలర్ దార లావణ్య-అశోక్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని స్థానిక 33వ వార్డు బివై నగర్ గల్లీల్లో ఉన్న బోరు పాడైపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. వార్డులో గత ఐదు, ఆరు రోజులుగా తాగునీరు రాక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ దార లావణ్య అశోక్ తక్షణమే స్పందించారు. ప్రజల కష్టాలను చూసి చలించి, అధికారుల కోసం వేచి చూడకుండా తన సొంత ఖర్చులతో కొత్త బోరు మోటార్‌ను కొనుగోలు చేసి బిగించారు. శుక్రవారం నాడు ఈ నూతన మోటార్ ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా దార లావణ్య–అశోక్ మాట్లాడుతూ.. "ప్రజల సేవలోనే పరమార్థం ఉందని, భవిష్యత్తులో కూడా వార్డు ప్రజలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే స్పందించి అండగా ఉంటామని" హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా వాడకట్టు పెద్దలు మరియు ప్రజలు మాట్లాడుతూ.. నీటి కోసం అల్లాడుతున్న సమయంలో తమకు అండగా నిలిచిన మాజీ కౌన్సిలర్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో స్పందించి నీటి కష్టాలను తీర్చినందుకు వాడకట్టు ప్రజలు మరియు 'నటరాజ్ యూత్' సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వారి సేవా దృక్పథాన్ని కొనియాడుతూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నటరాజ్ యూత్ సంఘ సభ్యులు మరియు వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.



# మండెపల్లి గ్రామంలో నట్టల నివారణ మందుల పంపిణీ

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలం మండెపల్లి గ్రామంలో నట్టల నివారణ మందుల పంపిణీ సర్పంచ్ గాధగోని సాగర్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాధగోని సాగర్ మాట్లాడుతూ.. ఈ నట్టల నివారణ మందుల వలన మేకలకు, గొర్లకు ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా మందుల పంపిణీ వలన గొల్ల మందుల పంపిణీ వలన కురుమ సభ్యులు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఆఫీసర్ మౌనిక, సిబ్బంది రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అసాని మహిపాల్ రెడ్డి, యాస రాజేష్,కడారి ప్రతాప్ రెడ్డి, జడల ఆనంద్, సింగం శశికుమార్, గొల్ల కురుమ సంఘం ప్రెసిడెంట్ అమరగొండ మొండయ్య, ప్రధాన కార్యదర్శి ఒగ్గు దేవయ్య, బండి బీరయ్య, మేకల కుంటయ్య, అమరగొండ ప్రభు దాస్, బోడపట్ల బాలయ్య,జగ్గానీ మల్లేశం, జగ్గాని పరశురాం, ఒగ్గు రాము, ముద్దాల రాజయ్య,అమరగొండ ప్రశాంత్, బండి శ్రీకాంత్, బండి కృష్ణబాబు, అమరగొండ కృష్ణ ప్రసాద్, ముద్దాల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.




# ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గంను శనివారం రోజున ఎకాగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎలిగేటి సూర్యకిరణ్ క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షుడిగా ఎలిగేటి ప్రదీప్ ప్రధాన కార్యదర్శిగా ఆకుల గంగాధర్, కోశాధికారిగా పోగుల మోహన్, సలహాదారుడిగా తుమ్మనపల్లి శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఎలిగేటి సూర్య కిరణ్ మాట్లాడుతూ.. పాత్రికేయుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. నూతన మండలంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణంతో పాటు పాత్రికేయులకు అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలల కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు నంద్యాడపు అంజయ్య, బింగిశెట్టి వెంకటేష్, కుర్మచలం సత్యనారాయణ, సుడిగేపు పరుశురాం లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కరించాలి..

- కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు జాబ్ సెక్యూరిటీతో పాటు యూజీ సీ పే స్కేల్స్ అమలు చేయాలని విప్ ఆది శ్రీనివాస్ కు వినతి

**బలగం టీవీ, వేములవాడ:**




తెలంగాణ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తక్షణమే జాబ్ సెక్యూరిటీ కల్పించాలని మరియు యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. గత ఏప్రిల్ 2025లో నిర్వహించిన ధర్నా సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, నెల రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఎనిమిది నెలలు గడిచినా విద్యాశాఖ అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంపై అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మరోసారి తమ గోడును ప్రభుత్వానికి వినిపించేందుకు విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రానా మరియు ముఖ్యమంత్రితో మాట్లాడి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అధ్యాపకుల వినతిపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ యూసీఈఆర్‌కు చెందిన డి. భాస్కర్, బి. రంజిత్ కుమార్, బి. నర్సయ్య, ఎస్. కుమార స్వామి, జి. శ్రావణ్ కుమార్, కె. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వెలమ జాతిని కించపరిస్తే సహించం..



- ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ (ఏఐడబ్ల్యూఏ)
- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం

**బలగం టీవీ, హైదరాబాద్**

కొడంగల్‌లో జరిగిన సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెలమ జాతిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ (ఏఐడబ్ల్యూఏ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని ఐవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి తీరును తీవ్రంగా ఖండించారు.

ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి, ఒక నిర్దిష్ట సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడటం ఆయన సంస్కారానికే విరుద్ధమని ఐవా ప్రతినిధులు మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి అన్ని వర్గాలను సమానంగా చూడాలని, వివక్ష చూపడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. కేవలం వెలమ జాతినే లక్ష్యంగా చేసుకుని అవహేళన చేయడం పట్ల యావత్ వెలమ సమాజం తీవ్ర ఆందోళన చెందుతోందని వారు పేర్కొన్నారు. పాలకులే ఇటువంటి వ్యాఖ్యలు చేయడం వల్ల సమాజంలో తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. జిల్లా, మండల స్థాయిల్లోని వెలమ సంఘాలను ఏకం చేసి నిరసనలు తెలుపుతామని, కాంగ్రెస్ మరియు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను కలిసి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకువస్తామని వెల్లడించారు. అవసరమైతే న్యాయపరమైన చర్యలు కూడా చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తాండ్ర శ్రీనివాస్ రావు, నీలగిరి దివాకర్ రావు, కార్యవర్గ సభ్యులు బాలమూరి జగన్ మోహన్ రావు, పొల్సాని రవీందర్ రావు, కోట్ల నరేందర్ రావు, అల్లాడి రాజేందర్ రావు, పడకంటి షర్మిల మరియు ఐవా సభ్యులు పాల్గొన్నారు.



## సర్పంచ్ కనకయ్యకు ఘన సన్మానం

**బలగం, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఎనుగుల కనకయ్యనీ టి.ఎన్.జి.ఓ.ఎస్ ఫంక్షన్ హాల్‌లో జడ్.పి.హెచ్.ఎస్ విలాసాగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం రోజున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓ.ఎస్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, జడ్.పి.హెచ్.ఎస్ అభివ ృద్ధి కమిటీ జనరల్ సెక్రటరీ గడప కోటేష్, ట్రెజరర్ రుద్ర ఆంజనేయులు, అలాగే పద్మతింటి సత్తయ్య, కొండ రాజయ్య, స్వదేశ్ కుమార్, పొలాడి వెంకటేశ్వర రావు, చారి, గడప నారాయణయ్య, ముమ్మడి శ్రీనివాస్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచులు

**బలగం, బోయినిపల్లి**

చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొత్తపేట సర్పంచ్ ఇల్లెందుల రాజేశం బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరియు మల్కాపూర్ సర్పంచ్ మడ్లపల్లి తులసి–గంగయ్య శనివారం రోజున చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు

# కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప సర్పంచ్ కల్లేపల్లి చంద్రయ్య

**బలగం, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామ ఉపసర్పంచ్ కల్లెపెల్లి చంద్రయ్య, వార్డ్ సభ్యులు కొలుపుల మల్లేశం,కల్లేపల్లి మమత, గ్రామ నాయకులు కనపర్తి వెంకటచారి, సూదుల రవి,నలిమేల నాగేష్, సురువు నాంపల్లి, ఆకుల సుధాకర్, అక్కరాజు చంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు కొలుపుల ప్రవీణ్, పెంచాల సత్తయ్య, అతికం చంద్రయ్య, గడ్డం శ్రీనివాస్, కల్లెపల్లి శంకరయ్య, కొలుపుల మల్లయ్య, కుంభాకారీ నాగార్జున్, కల్లేపల్లి లక్ష్మణ్ పేరుక సుధాకర్ లు చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం



చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఉప సర్పంచ్ మాట్లాడుతూ:కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం అని తెలిపారు.

# అండర్-19 వరల్డ్‌కప్‌కు భారత జట్టు ప్రకటన

- కెప్టెన్‌గా ఆయుష్ మాత్రే
- వైభవ్ సూర్యవంశీకి చోటు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభం కానున్న ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జరగనుంది. ముంబై యువ ఓపెనర్ ఆయుష్ మాత్రేకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, విహాన్ మల్హోత్రాను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ జట్టులో 14 ఏళ్ల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కడం విశేషం. మొత్తం 15 మంది సభ్యులతో కూడిన జట్టును బీసీసీఐ ప్రకటించింది.

**భారత అండర్--19 జట్టు**

ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు, హర్వాన్ష్ సింగ్ (వికెట్‌కీపర్), అంబ్రిష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, మొహమ్మద్ ఎనాన్, హెనిల్ పటేల్, దీపేశ్, కిషన్ కుమార్, ఉద్ధవ్ మోహన్.

వరల్డ్‌కప్‌కు ముందు ఈ యువ జట్టు దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ జనవరి 3, 5, 7 తేదీల్లో జరగనుంది. అయితే గాయాల కారణంగా కెప్టెన్ ఆయుష్ మాత్రే, వైస్ కెప్టెన్ విహాన్ మల్హోత్రా ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండరు. ఈ పర్యటనలో భారత జట్టుకు వైభవ్ సూర్యవంశీ నాయకత్వం వహించనున్నాడు. అండర్-19 వరల్డ్‌కప్‌కు ముందు ఈ సిరీస్ యువ





ఆటగాళ్లకు కీలక పరీక్షగా మారనుంది.

## బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో విషాదం

- మ్యాచ్ సందర్భంగా కుప్పకూలిన ఢాకా క్యాపిటల్స్ అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ మృతి

**బలగం టీవీ, ఢాకా**



క్రికెట్ మైదానంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) సందర్భంగా ఢాకా క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ (50) హఠాత్తుగా మరణించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు మైదానంలో ఉన్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిన ఆయనను వెంటనే ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు నిలబెట్టలేకపోయారు. శనివారం సిల్హెట్ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగనున్న మ్యాచ్‌కు ముందు పిచ్‌ను పరిశీలించిన జకీ, కొద్దిసేపటికే అస్వస్థతకు గురై మైదానంలోనే కుప్పకూలిపోయారు. ఇది గమనించిన జట్టు సిబ్బంది, వైద్య బృందం తక్షణమే కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) నిర్వహిస్తూ ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆయనను ఆస్పత్రికి తరలించగా, అక్కడ వైద్యులు మృతిగా ప్రకటించారు. ఈ విషాద ఘటనతో ఢాకా క్యాపిటల్స్ జట్టు సభ్యులు, సహాయక సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మైదానంలో ఒక్కసారిగా నెలకొన్న విషాద వాతావరణం అభిమానులను కూడా కలచివేసింది. క్రీడా ప్రపంచం మొత్తం మహబూబ్ అలీ జకీ ఆకస్మిక మృతిపై సంతాపం వ్యక్తం చేస్తోంది.

## ‘దండోరా’కు ప్రశంసల వర్షం

- తెలంగాణ మట్టివాసనను ప్రతిబింబించిన చిత్రం : మంత్రి కోమటిరెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**



శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘దండోరా’ ప్రేక్షకుల ఆదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నెల 25న విడుదలైన ఈ సినిమా, విడుదలకు ముందే సామాజిక అంశాల ఆధారిత కథతో ఆసక్తి రేపగా విడుదల అనంతరం కూడా అదే స్థాయిలో పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యం, సహజమైన పాత్రలు, హృదయాన్ని తాకే కథనం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. తొలి రోజు నుంచే మంచి వసూళ్లు సాధిస్తూ థియేటర్ల సంఖ్యను పెంచుకుంటూ పోతుండటం విశేషం.

ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాజాగా ఈ చిత్రాన్ని వీక్షించారు. సినిమా అనంతరం ఆయన స్పందిస్తూ ‘దండోరా’ తనను ఎంతో ఆకట్టుకుందని తెలిపారు. తెలంగాణ మట్టిలో పుట్టిన కథగా ఈ చిత్రం ఎంతో సహజంగా, నిజాయితీగా ఉందని ప్రశంసించారు. గ్రామీణ జీవన విధానం, మనుషుల మధ్య ఉన్న అనుబంధాలు, సామాజిక సమస్యలను చాలా సున్నితంగా ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయం అన్నారు. మన చుట్టూ జరుగుతున్నా తరచూ మనం గమనించని అంశాలను ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. వినోదంతో పాటు విలువైన సందేశాన్ని అందించడంలో ‘దండోరా’ పూర్తిగా విజయవంతమైందని ఆయన అభిప్రాయపడ్డారు. ‘బలగం’ తర్వాత అంతే భావోద్వేగాన్ని కలిగించిన చిత్రంగా ‘దండోరా’ నిలిచిందని అన్నారు. తెలంగాణ సంస్కృతి, జీవన విధానాన్ని సున్నితంగా ప్రతిబింబించిన ఈ చిత్రాన్ని రూపొందించిన చిత్రబృందానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభినందనలు తెలిపారు.




## ‘కాగితం పడవలు’ టీజర్‌ను ఆవిష్కరించిన శర్వానంద్

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ తాజాగా ‘కాగితం పడవలు’ సినిమా టీజర్‌ను విడుదల చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో వర్ధన్, కృష?ప్రియ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి.ఆర్. ప్రసాద్ రెడ్డి, గాయిత్రమ్మ అంజనప్ప అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించారు.

శర్వానంద్ మాట్లాడుతూ.. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా కేవలం ప్యాషన్‌తో సినిమాను తెరకెక్కించిన దర్శకుడు తుకారాంను అభినందించారు. టీజర్ చాలా నిజాయితీగా, ఆసక్తికరంగా ఉందని పేర్కొన్నారు. హీరో వర్ధన్ తన తొలి చిత్రంలోనే పరిపక్వ నటన కనబరిచాడని ప్రశంసించారు. “ప్రేమ నిప్పులాంటిది అది జీవితానికి వెలుగునిచ్చే దీపం కావచ్చు లేదా దహించే కార్చిచ్చు కావచ్చు” అనే డైలాగ్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోందని తెలిపారు. అలాగే హీరో-హీరోయిన్ మధ్య కెమిస్ట్రీ, భావోద్వేగభరితమైన సన్నివేశాలు, ఏఐఎస్ నౌఫల్ రాజా అందించిన నేపథ్య సంగీతం, రుద్రసాయి సినిమాటోగ్రఫీ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయని అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం. హిమ బిందు పర్యవేక్షణలో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను పీఆర్వో

## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో చార్జిషీట్

- ఏ11గా నటుడు అల్లు అర్జున్

**బలగం టీవీ, హైదరాబాద్**


ఫైల్ ఫోటో

2024 డిసెంబర్‌లో ‘పుష్ప 2: ది రూల్’ సినిమా ప్రీమియర్ సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన విషాదకర తొక్కిసలాట ఘటనలో హైదరాబాద్ పోలీసులు కీలక ముందడుగు వేశారు. ఈ ఘటనకు సంబంధించి హీరో అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా పేర్కొంటూ చిక్కడపల్లి పోలీసులు నాంపల్లి కోర్టులో దాదాపు 100 పేజీల సమగ్ర చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఈ కేసులో మొత్తం 23 మందిని నిందితులుగా చేర్చినట్లు పోలీసులు వెల్లడించారు. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని ప్రధాన నిందితులుగా పేర్కొనగా, అల్లు అర్జున్‌తో పాటు ఆయన వ్యక్తిగత మేనేజర్, సిబ్బంది సభ్యులు, ఎనిమిది మంది బౌన్సర్ల పేర్లు కూడా చార్జిషీట్‌లో ఉన్నాయి. ప్రీమియర్ షో సందర్భంగా వేలాదిగా అభిమానులు తరలివస్తారని తెలిసినప్పటికీ, తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం వల్లే ఈ దురెటన చోటుచేసుకుందని పోలీసులు స్పష్టం చేశారు. జనసమూహాన్ని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే తొక్కిసలాట జరిగి ఒక మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడినట్లు చార్జిషీట్‌లో పేర్కొన్నారు.

ఈ ఘటనలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై ఇప్పటికే సమగ్ర దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు ఇప్పుడు న్యాయ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ ఈ కేసులో బెయిల్‌పై ఉన్నారు. బాధిత కుటుంబానికి సహాయంగా ఆయనతో పాటు ‘పుష్ప’ చిత్ర బృందం సుమారు రూ.2 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జమ చేసినట్లు సమాచారం. చార్జిషీట్ దాఖలుతో ఈ కేసు తదుపరి న్యాయ విచారణ దశలోకి ప్రవేశించింది.

# బాక్సింగ్ డే టెస్టు ఇంగ్లండ్‌దే



- యాషెస్ నాలుగో టెస్టులో 6 వికెట్ల తేడాతో గెలుపు
- రెండు రోజుల్లో ముగిసిన మ్యాచ్
- 14 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ విజయం

**బలగం టీవీ, మెల్‌బోర్న్**

తీవ్ర ఉత్కంఠభరితంగా సాగిన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ జట్టు చారిత్రాత్మక విజయం సాధించింది. వరుసగా మూడు టెస్టుల్లో పరాజయం అనంతరం ఆషెస్ సిరీస్‌లో నాలుగో టెస్టులో ఇంగ్లండ్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ పూర్తిగా బౌలర్ల ఆధిపత్యంలో సాగి కేవలం రెండు రోజుల్లోనే ముగిసింది. ఈ గెలుపుతో 14 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ విజయం సాధించిన ఘనత ఇంగ్లండ్‌కు దక్కింది. చివరిసారిగా 2010-11 సిరీస్‌లో ఇంగ్లండ్ ఇక్కడ విజయం సాధించింది.

175 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 32.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జాకోబ్ బెతెల్ 46 బంతుల్లో 5 ఫోర్లతో 40 పరుగులు చేయగా, బెన్ డకెట్ 34, జాక్ క్రాలీ 37 పరుగులతో జట్టును విజయతీరాలకు చేర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, జై రిచర్డ్‌సన్, స్కాట్ బోలాండ్ తలా రెండు వికెట్లు తీశారు.

అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 34.3 ఓవర్లలో 132 పరుగులకే కుప్పకూలింది. ట్రావిస్ హెడ్ 46, స్టీవ్ స్మిత్ 24లి, కామెరూన్ గ్రీన్ 19 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌లకే పరిమిత మయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 4/34తో రాణించగా, బెన్ స్టోక్స్ 3/24తో సహకరించాడు. జోష్ టంగ్‌కు 2 వికెట్లు దక్కాయి.

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 45.2 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌటైంది. మైఖెల్ నెసర్ 35, ఉస్మాన్ ఖవాజా 29, అలెక్స్ క్యారీ 20 పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్ 5 వికెట్లతో చెలరేగగా, గస్ అట్కిన్సన్ రెండు వికెట్లు తీశాడు. బెన్ స్టోక్స్, బ్రైడన్ కార్స్ ఒక్కో వికెట్ సాధించారు. దీనికి ప్రతిగా తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 29.5 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ 41, గస్ అట్కిన్సన్ 28, బెన్ స్టోక్స్ 16 పరుగులు మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైఖెల్ నెసర్ 4 వికెట్లు, స్కాట్ బోలాండ్ 3 వికెట్లు, మిచెల్ స్టార్క్ 2 వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో సిరీస్‌లో ఇంగ్లండ్ గౌరవప్రదమైన పోరాటాన్ని కొనసాగిస్తూ చరిత్రాత్మక ఘనతను తన ఖాతాలో వేసుకుంది.

## ‘అమరావతికి ఆహ్వానం’ టీజర్ విడుదల

- థ్రిల్లర్ జోనర్‌లో మరో ఆసక్తికర ప్రయత్నం

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలుగులో థ్రిల్లర్ జానర్‌కు మంచి ఆదరణ ఉన్న విషయం తెలిసిందే. అదే కోవలో ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసే కొత్త చిత్రం ‘అమరావతికి ఆహ్వానం’. ధన్య బాలకృష్ణ, ఎస్తర్ నోరోన్హా, శివ కంఠమనేని, సుప్రిత, హరీష్, అశోక్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. జీవీకే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సీట్ ఎడ్జ్ హారర్ థ్రిల్లర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. “కీటక మరణం కప్ప జీవనాధారం కప్ప మరణం పాము జీవనాధారం ఈ సృష్టి అంతా జనన-మరణాల పోరాటం ఇది ఒక యుద్ధం ఒకరి గెలుపు మరొకరి అంతం” అనే డైలాగ్‌తో ప్రారంభమైన టీజర్ కథలోని ఉత్కంఠను బలంగా సూచిస్తోంది. ముఖ్యంగా ధన్య బాలకృష? డార్క్ షేడ్‌లో కనిపిస్తూ ఇచ్చిన డైలాగ్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ఇటీవలి కాలంలో హారర్ సినిమాలకు మంచి ఆదరణ లభిస్తుండగా, అదే ట్రెండ్‌ను కొనసాగించేలా ఈ చిత్రం రూపొందుతోందని దర్శకుడు జీవీకే తెలిపారు. థ్రిల్లింగ్ కథనం, సస్పెన్స్‌తో కూడిన స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని ఆయన అన్నారు. సీనియర్ సినిమాటోగ్రాఫర్ జే. ప్రభాకర్ రెడ్డి అందించిన విజువల్స్, ‘హనుమాన్’ ఫేమ్ సాయి బాబు తలారి ఎడిటింగ్ ఈ చిత్రానికి ప్రధాన బలాలుగా నిలవనున్నాయని వెల్లడించారు. పద్మనాభ్ భరద్వాజ్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హారర్ ఎలిమెంట్స్‌ను మరింత ఎలివేట్ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రధాన పాత్రలను డార్క్ షేడ్స్‌లో చూపిస్తూ ఆసక్తిని రేకెత్తించారు. లీడ్ క్యారెక్టర్లు బ్లాక్ డ్రెస్‌లో కనిపిస్తూ కథలోని సస్పెన్స్‌కు సంకేతమిచ్చారు. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై కేఎస్ శంకర్ రావు, ఆర్. వెంకటేశ్వర రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమాను త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ వెల్లడించారు.